పరిశ్రమకు బంగ్లా బెంగ



పొరుగు దేశంలో సంక్షోభంపై భారతీయ కంపెనీల్లో ఆందోళన

ఉత్పత్తి, డెలివరీలపై ప్రభావం • స్టాక్ మార్కెట్లలోనూ ప్రకంపనలు

భారీ నష్టాల్లో ఆయా సంస్థల షేర్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 6: బంగ్లాదేశ్‌లో నెలకొన్న సంక్షోభంపై భారతీయ వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. పొరుగు దేశంలో కర్మాగారాలను నడిపిస్తున్న, వ్యాపారాలను నిర్వహిస్తున్న దేశీయ కంపెనీలు.. తమ ఉత్పత్తి, ఆర్డర్ల డెలివరీపై బెంగ పెట్టుకుంటున్నాయి. ప్రభుత్వ వ్యతిరేక నిరసనల నడుమ బంగ్లాదేశ్ ప్రధాన మంత్రి షేక్ హసీనా రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అల్లరి మూకలు విధ్వంసం సృష్టిస్తుండటంతో అన్ని కార్యకలాపాలు స్తంభించిపోయాయి. మార్కెట్ మూతబడగా, వ్యాపారం ఆగిపోయింది. పరిశ్రమల్లో ఉత్పత్తి కూడా నిలిచిపోయింది. దీంతో వివిధ రంగాలపై ఆ ప్రభావం ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నది.

వస్త్ర పరిశ్రమ దిగాలు

బంగ్లాదేశ్ పరిస్థితులు భారతీయ టెక్స్‌టైల్, దుస్తుల రంగాన్ని ఎక్కువగా ప్రభావితం చేస్తున్నాయి. అక్కడి అల్లర్లు, హింస రవాణా వ్యవస్థను స్తంభింపజేయడంతో అటు నుంచి ఇటు రావాల్సిన సరకుల సప్లై నిలిచిపోతున్నదని మంగళవారం భారతీయ టెక్స్‌టైల్ పరిశ్రమ సమాఖ్య (సీఐటీఐ) ఆందోళన వెలిబుచ్చింది. బంగ్లాదేశ్‌లో ఫ్యాక్టరీలను నిర్వహిస్తున్న భారతీయ సంస్థలకు ప్రస్తుతం అక్కడి పరిస్థితులు సవాలేనని వ్యాఖ్యానించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది. సరఫరా లేక మార్కెట్ డిమాండ్‌ను అందుకోలేకపోతున్నాయని సీఐటీఐ పేర్కొన్నది. మరోవైపు బంగ్లా సంక్షోభం.. భారత్‌లో వస్త్ర పరిశ్రమకు కేంద్రంగా ఉన్న తిరుప్పూర్‌కు లాభిస్తుందన్న అభిప్రాయాలూ వినిపిస్తున్నాయి. అక్కడి నుంచి సరకు రాకపోతే ఇక్కడ తయారీ మరింత పుంజుకోవచ్చంటున్నారు. కాగా, భారతీయ టెక్స్‌టైల్స్‌కు బంగ్లాదేశ్ కీలక మార్కెట్‌గా వర్ధిల్లుతున్న సంగతి విదితమే. ప్రపంచవ్యాప్తంగా కూడా ఇక్కడి దుస్తుల తయారీ పరిశ్రమకు పేరున్నది. భారత్ నుంచే ఇక్కడికి నూలు పెద్ద ఎత్తున ఎగుమతి అవుతున్నది.

స్టాక్ ఎక్స్ఛేంజీల్లో అలజడి

బంగ్లాదేశ్‌లో వ్యాపార, పారిశ్రామిక కార్యకలాపాలతో సంబంధాలున్న భారతీయ సంస్థల షేర్లు.. దేశీయ స్టాక్ మార్కెట్లలో విపరీతంగా నష్టాలను చవిచూస్తున్నాయి. సఫోలా వంటనూనెల తయారీదారు మారికో షేర్ ధర 6 శాతానికిపైగా పడిపోయింది. కంపెనీ రెవిన్యూలో బంగ్లాదేశ్ అమ్మకాల వాటా 11-12 శాతంగా ఉండటమే కారణం. అక్కడి అల్లర్లతో వ్యాపారం నిలిచిపోయింది. ఇదే తరహాలో పెర్ల్ గ్లోబల్ ఇండస్ట్రీస్, ఇమామీ, బాయర్ కార్ప్, జీసీపీఎల్, బ్రిటానియా, వికాస్ లైఫ్‌కేర్, డాబర్, ఏషియన్ పెయింట్స్, పిడిలైట్, జుబిలెంట్ ఫుడ్‌వర్క్స్, బజాజ్ ఆటో షేర్లు నష్టపోతున్నాయి. టాటా మోటర్స్, హీరో మోటోకార్ప్ సేల్స్ కూడా బంగ్లాదేశ్‌లో భారీగానే జరుగుతున్నాయి. అయితే భారత్‌పైనే ఆధారపడి వ్యాపారం చేస్తున్న టెక్స్‌టైల్, దుస్తుల కంపెనీల షేర్లకు డిమాండ్ ఏర్పడింది. ఆయా సంస్థల వ్యాపారం పెరుగుతుందన్న అంచనాలే ఇందుకు కారణం.

> *బంగ్లాదేశ్‌లో పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నది. అక్కడి పరిణామాలన్నింటినీ నిశితంగా గమనిస్తున్నాం. టెక్స్‌టైల్ రంగంలో బంగ్లాదేశ్ వృద్ధిరేటు ఆదర్శనీయం. మొత్తం ఉపఖండం వాణిజ్యానికే అది బలం. కానీ ఇప్పుడు అక్కడ సంక్షోభం నెలకొన్నది. రవాణా వ్యవస్థ స్తంభించిపోయింది. భారత్‌లో ఉత్పత్తి, సరఫరాపై ఆ ప్రభావం పడుతున్నది. పరిస్థితులు త్వరలోనే చక్కబడుతాయని ఆశిస్తున్నాం.*
>
> *-చంద్రిమా చటర్జీ, సీఐటీఐ ప్రధాన కార్యదర్శి*

స్థిరాస్తి యజమానులకు ఊరట

ఎల్‌టీసీజీ పన్నుపై కొత్త, పాత విధానాల్లో ఆప్షన్ • బడ్జెట్ ముందు ఇల్లు కొంటేనే..

న్యూఢిల్లీ, ఆగస్టు 6: పన్ను చెల్లింపుదారులకు కేంద్ర ప్రభుత్వం ఊరటనిచ్చింది. ఈ ఏడాది జూలై 23 కంటే ముందు ఇండ్లను కొనుగోలు చేసినవారు.. వాటిని అమ్ముకున్నప్పుడు చెల్లించే దీర్ఘకాల మూలధన లాభాల (లాంగ్‌టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ లేదా ఎల్‌టీసీజీ) పన్నుకు సంబంధించి ఉన్న కొత్త, పాత విధానాల్లో ఏదో ఒకదాన్ని ఎంచుకునే అవకాశాన్ని కల్పించింది. ఈ మేరకు మంగళవారం లోక్‌సభలో సభ్యులకు అందించిన ఆర్థిక బిల్లు-2024లో సవరణలు చేసింది. దీంతో వ్యక్తులు లేదా హిందూ అవిభాజ్య కుటుంబాలు (హెచ్‌యూఎఫ్) ఇండెక్సేషన్ బెనిఫిట్‌తో 20 శాతం పన్ను లేదా అది లేకుండా 12.5 శాతం పన్ను ఏది లాభమైతే అది ఎంచుకునే వీలుంటుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను గత నెల 23న లోక్‌సభలో బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రాపర్టీస్‌పై ఎల్‌టీసీజీ పన్నును 20 నుంచి 12.5 శాతానికి తగ్గించి దానికున్న ఇండెక్సేషన్ బెనిఫిట్‌ను తొలగిస్తున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే. 2001 ఏప్రిల్ 1 తర్వాత కొన్న ఇండ్లకు ఇండెక్సేషన్ ప్రయోజనం ఉండదని స్పష్టం చేశారు. దీంతో అటు స్థిరాస్తి క్రయవిక్రయదారుల నుంచి ఇటు నిర్మాణ రంగ వ్యాపారుల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత వ్యక్తమైంది. దీనిపై పునరాలోచనలోపడ్డ మోదీ సర్కారు వెనక్కి తగ్గుతూ తాజా సవరణల్ని తీసుకొచ్చింది. బడ్జెట్‌లో కేంద్రం తీసుకున్న నిర్ణయంతో పన్ను చెల్లింపుదారులపై అదనపు భారం పడుతుందని, ఇండెక్సేషన్

బెనిఫిట్‌ను ఉంచాల్సిందేనని ట్యాక్స్ ఎక్స్‌పర్ట్స్ కూడా చెప్తున్నారు. అయితే జూలై 23 కంటే ముందు ఇండ్లు కొన్నవారికే ఇండెక్సేషన్ బెనిఫిట్‌ను అందించడం సరికాదని, మొత్తం బడ్జెట్ నిర్ణయాన్నే ఉపసంహరించుకోవాలన్న డిమాండ్లూ వ్యక్తమవుతున్నాయి.

10 లక్షల కోట్ల రైటాఫ్

న్యూఢిల్లీ, ఆగస్టు 6: గడిచిన ఐదేండ్లలో రూ.9.90 లక్షల కోట్ల విలువైన రుణాలపై బ్యాంకులు రైటాఫ్ చేసినట్లు పార్లమెంట్‌కు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. 2023-24లో రూ.1.70 లక్షల కోట్లను రైటాఫ్ చేసిన బ్యాంక్..అంతక్రితం ఏడాదిలో రూ.2.08 లక్షల కోట్లను రైటాఫ్ చేసినట్లు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరీ రాజ్యసభకు లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారు. ఈ రైటాఫ్ వల్ల రుణాలు తీసుకున్నవారికి ఎలాంటి ప్రయోజనం లభించదని, తాకట్టు కింద పెట్టిన ఆస్తులను విక్రయించగా వచ్చిన నిధులను రైటాఫ్‌ల కింద జమ చేయనున్నట్లు మంత్రి చెప్పారు. ఇప్పటికే ఈ రైటాఫ్‌ల్లో రూ.1.84 లక్షల కోట్లను బకాయి చేసినట్లు తెలిపారు. అలాగే ఐదేండ్ల క్రితం రూ.8,96,082 కోట్లు గావున్న షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకుల నిరర్థక ఆస్తులు రూ.4,80,687 కోట్లకు తగ్గాయని పేర్కొన్నారు.

ఎఫ్‌టీసీసీఐ వైస్ ప్రెసిడెంట్‌గా కృష్ణకుమార్

హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ) : ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) వైస్ ప్రెసిడెంట్‌గా కృష్ణకుమార్ మహేశ్వరీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ పదవిలో ఆయన ఏడాది పాటు కొనసాగనున్నారు.

ఎస్బీఐ చైర్మన్‌గా సీఎస్ శెట్టి

న్యూఢిల్లీ, ఆగస్టు 6: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) చైర్మన్‌గా చల్లా శ్రీనివాసులు శెట్టి నియామకానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఆయన ఈ పదవిలో మూడేండ్లపాటు కొనసాగనున్నారు. ప్రస్తుతం బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న శెట్టి.. దినేశ్ ఖారా స్థానాన్ని భర్తీ చేయనున్నారు. ఈ నెల 28న బ్యాంక్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు.

తగ్గిన బంగారం ధర

రూ.1,100 దిగిన తులం రేటు

కిలో వెండి ధర కూడా రూ.2,200 చౌక

న్యూఢిల్లీ, ఆగస్టు 6: బంగారం ధరలు భారీగా తగ్గాయి. మంగళవారం ఢిల్లీలో 24 క్యారెట్ 10 గ్రాముల రేటు రూ.1,100 దిగి రూ.71,700 వద్ద నిలిచింది. నగల వర్తకులు, రిటైల్ కొనుగోలుదారుల నుంచి డిమాండ్ అంతంతమాత్రంగా ఉండటం వల్లే రేట్లు తగ్గినట్టు మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇక ఆభరణాల పుత్తడి రేట్లూ దిగువ ముఖం పట్టాయి. 22 క్యారెట్ తులం విలువ రూ.71,350గా నమోదైంది. క్రితంతో చూస్తే రూ.1,100 దిగొచ్చింది. అంతకుముందు ఇది రూ.72,450గా ఉన్నది. ఇదిలావుంటే హైదరాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ 10 గ్రాములు రూ. 71,500గా ఉన్నాయి.

దిగొస్తున్న వెండి ధరలు

బంగారం ధరలకుతోడు వెండి రేట్లూ తగ్గుతున్నాయి. మంగళవారం కిలో ధర రూ.2,200 దిగింది. రూ.82,000గా ఉన్నది. అయితే గత నాలుగు రోజుల్లో రేట్లు రూ.4,200 తగ్గినట్టు అఖిల భారత సరఫ సంఘం చెప్తున్నది. రిటైల్ కస్టమర్లతోపాటు ఇండస్ట్రీ వర్గాల నుంచి వెండికి ఆదరణ తగ్గిందని ట్రేడర్లు అంటున్నారు. అందుకే ధరలు క్రమేణా దిగివస్తున్నాయని పేర్కొంటున్నారు. గ్లోబల్ మార్కెట్‌లోనూ రేట్లు పడిపోయాయి. ఈ ఒక్కరోజే ఔన్సు గోల్డ్ ధర ఏకంగా 20 డాలర్లు తగ్గడం గమనార్హం. దీంతో 2,409 డాలర్లుగా ఉన్నది. వెండి ధర 26.94 డాలర్లుగా ఉన్నది. ఫ్యూచర్ మార్కెట్‌లో నెలకొన్న ఒడిదొడుకులతోనే ధరలు తగ్గుతున్నాయని ట్రేడింగ్ వర్గాలు చెప్తున్నాయి. దీంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు.. భారతీయ మార్కెట్‌పైనా ప్రభావం చూపుతున్నాయి.

డైలమాలో ఇన్వెస్టర్లు

స్టాక్ మార్కెట్లు గత మూడు రోజులుగా నష్టాలకే పరిమితమవుతున్నాయి. ప్రతికూల పరిణామాలు ఇందుకు కారణంగా నిలుస్తుండగా.. మదుపరులు పెట్టుబడుల ఉపసంహరణలకు దిగుతున్నారు.

ఎల్ఐసీ నాలుగు ప్లాన్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 6: దేశీయ బీమా దిగ్గజం ఎల్ఐసీ ఒకేసారి నాలుగు పాలసీలను మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. ఎల్ఐసీ యువ టర్మ్, డిజీ టర్మ్‌తోపాటు యువ క్రెడిట్ లైఫ్, డిజీ క్రెడిట్ లైఫ్ పేర్లతో వీటిని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ సరికొత్త ప్లాన్లను కంపెనీ సీఈవో, ఎండీ సిద్ధార్థ మోహంతీ ప్రారంభించారు. టర్మ్ ఇన్సూరెన్స్ కల్పించడంతోపాటు లోన్ రీపేమెంట్స్ కలిగిన ఈ పాలసీలు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోనూ లభించనున్నాయి.

యువ టర్మ్/డిజీ టర్మ్ ప్లాన్లు..

- నాన్-లింక్డ్, లైఫ్, వ్యక్తిగత, పూర్తిగా రిస్క్ ప్లాన్ ఇది..
- కనీస వయస్సు 18 ఏండ్లు కాగా, గరిష్ఠ వయస్సు 45 ఏండ్లు
- మెచ్యూరిటీ వయస్సు 33 ఏండ్లు కాగా, గరిష్ఠంగా 75 ఏండ్లు
- బేసిక్ సమ్ అష్యూర్డ్ రూ.50 లక్షలు, గరిష్ఠంగా రూ.5 కోట్లు
- మహిళలకు తక్కువ ప్రీమియం

3 రోజుల్లో 22 లక్షల కోట్లు మటాష్

స్టాక్ మార్కెట్ల నష్టంతో సంపదను కోల్పోయిన మదుపరులు

న్యూఢిల్లీ, ఆగస్టు 6: స్టాక్ మార్కెట్ల భారీ పతనంతో మదుపరులు నిండా మునిగారు. గత మూడు రోజుల్లో దేశీయ స్టాక్ మార్కెట్లు నాలుగు శాతం వరకు నష్టపోవడంతో మదుపరులు ఏకంగా రూ.22 లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. గత మూడు సెషన్లలో సెన్సెక్స్ 3,274.48 పాయింట్లు లేదా 3.99 శాతం నష్టపోయింది. ఈ నెల 1న చారిత్రక గరిష్ఠ స్థాయి 82,129.49 పాయింట్లను తచ్చాడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ ఆ తర్వాతి నుంచి తిరోగమనబాట పట్టింది. దీంతో మంగళవారం బీఎస్ఈలో లిస్టైన కంపెనీల విలువ రూ.22,02,996.27 కోట్లు కరిగిపోయి రూ.4,39,59,953.56 కోట్లు(5.24 ట్రిలియన్ డాలర్లు) పడిపోయింది.

ప్రారంభ లాభాలు ఆవిరి

స్టాక్ మార్కెట్ల ప్రారంభ లాభాలు ఆవిరైపోయాయి. ఒక దశలో వెయ్యి పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు నష్టల్లోకి జారుకున్నాయి. ఇంట్రాడేలో 1,100 పాయింట్ల వరకు పెరిగిన సెన్సెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి 166.33 పాయింట్లు నష్టపోయి 78,593.07 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ సైతం 63 పాయింట్లు కోల్పోయి 24 వేల దిగువకు 23,992.55 వద్దకు జారుకున్నది.



- ఎస్బీఐ, మహీంద్రా, భారతీ ఎయిర్‌టెల్, టైటాన్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్‌లు అత్యధికంగా నష్టపోయాయి.
- కానీ, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టెక్ మహీంద్రా, లార్సెన్ అండ్ టుబ్రో, హెచ్‌యూఎల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, రిలయన్స్ షేర్లు తిరిగి లాభాల్లోకి వచ్చాయి.
- రంగాలవారీగా చూస్తే టెలికం, ఆర్థిక సేవలు, కన్స్యూమర్ డ్యూరబుల్, బ్యాంకింగ్ రంగ షేర్లు ఒక్క శాతం వరకు నష్టపోయాయి. కానీ, ఐటీ, రియల్టీ, ఎఫ్ఎంసీజీ, సేవల రంగ షేర్లు మదుపరులను ఆకట్టుకున్నాయి.
- అమెరికా ఆర్థిక వ్యవస్థ ఆర్థిక మాంద్యంలోకి జారుకోనుండటంతో ఐటీ, ఫార్మా రంగాలపై తీవ్ర స్థాయిలో ప్రభావం చూపనున్నది.
- సోమవారం 37 ఏండ్ల కనిష్ఠ స్థాయికి జారుకున్న జపాన్ నిక్కీ 225 షేరు మంగళవారం 10 శాతం లాభపడింది.

ఫ్యాన్స్ ఫిక్సయిపోయారు

బాలకృష్ణకు సంబంధించిన ఏ తాజా వార్త వెలుగుచూసినా.. అది సోషల్ మీడియాలో క్షణాల్లో వైరల్ అయిపోతూ ఉంటుంది. మాస్‌లో ఆయనకున్న క్రేజ్ అలాంటిది. ప్రస్తుతం ఆయన కేఎస్ రవీంద్ర(బాబీ) దర్శకత్వంలో సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో ఊర్వశీరౌతేలా కథానాయిక. కొత్త విషయం ఏంటంటే.. ఇందులో ఆమెతో పాటు మరో ఇద్దరు హీరోయిన్లు ఉన్నారట. వారే ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్. ఇది నిజమైతే అభిమానులకు నిజంగా పండుగే. ఈ సినిమాలో బాలయ్య రెండు కోణాలున్న పాత్రలో కనిపిస్తారని యూనిట్ వర్గాల సమాచారం. బాబీడియోల్ విలన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో మాస్ యాక్షన్ అంశాలకు కొదువుండదట. పైగా ఈ సినిమాలో పొలిటికల్ నేపథ్యం కూడా ఉంటుందని టాక్. 'రీసెంట్‌గా రషెస్ చూశాను.. ఫ్యాన్స్‌కి పండగే' అంటూ సంగీత దర్శకుడు తమన్ ఇచ్చిన లీక్ కూడా ఈ సినిమాపై అంచనాలు పెంచేసింది. దీంతో వరుసగా నాలుగో బ్లాక్‌బస్టర్ పక్కా అని ఫ్యాన్స్ ఫిక్స్ అయిపోయారు. ఇదిలావుంటే.. మలయాళంలో ఈ ఏడాది భారీ విజయాన్ని అందుకున్న ఫహద్ ఫాజిల్ 'ఆవేశం' సినిమాను, తెలుగులో బాలయ్యతో రీమేక్ చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయట. మైత్రీ మూవీమేకర్స్ అధినేతలు ఈ చిత్రం రీమేక్ హక్కులు సొంతం చేసుకోవడంతోపాటు, బాలకృష్ణను ఒప్పించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారట. మరి ఈ వార్తలో నిజమెంతో తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.

డబుల్ బ్లాక్‌బస్టర్ పక్కా

చిత్రం

' పూరీ జగన్నాథ్ హీరోయిన్ అనిపించుకోవాలని ఎప్పట్నుంచో కోరిక. 'ఇస్మార్ట్ శంకర్'కి ఆడిషన్ కూడా ఇచ్చా.. కుదర్లేదు. డబుల్ ఫన్, డబుల్ ఎంటర్‌టైన్‌మెంట్ వుండే ఈ 'డబుల్ ఇస్మార్ట్'లో అవకాశం దొరికింది. చెప్పలేనంత ఆనందంగా ఉంది. పూరీ అద్భుతమైన విజన్ ఉన్న గ్రేట్ డైరెక్టర్. ఆయన సినిమాలో చేయడమే ఓ గొప్ప విషయం అయితే.. రామ్, సంజయ్‌దత్ లాంటి బిగ్ స్టార్స్ ఉన్న సినిమాలో భాగం కావడం నిజంగా జాక్‌పాట్' అని కథానాయిక కావ్యథాపర్ అన్నారు. రామ్ కథానాయకుడిగా పూరీ జగన్నాథ్ స్వీయ దర్శకత్వంలో ఛార్మీతో కలిసి నిర్మించిన చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. బ్లాక్‌బాస్టర్ 'ఇస్మార్ట్ శంకర్'కి స్వీక్వెల్‌గా రూపొందిన ఈ సినిమా ఈ నెల 15న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఇందులో ఓ కథానాయికగా నటించిన కావ్యథాపర్ మంగళవారం విలేకరులతో ముచ్చటించింది. 'ఇందులో నాది బోల్డ్ అండ్ స్ట్రాంగ్ కేరక్టర్. అలాగే స్మార్ట్‌నెస్, ఇన్నోసెన్స్ కూడా ఉంటుంది. ఇందులో ఫైట్స్ కూడా చేశా. రామ్ హైలీ ఎనర్జిటిక్. మా కెమిస్ట్రీ యూత్‌ని బాగా ఆకట్టుకుంటుంది. నా కెరీర్‌లో బెస్ట్ డ్యాన్స్ ఇందులోనే ఇచ్చాను. అలాగే సంజయ్‌దత్‌సార్‌తో నటించడం మైండ్ బ్లోయింగ్ ఎక్స్‌పీరియన్స్. పేరుకు తగ్గట్టే 'డబుల్ ఇస్మార్ట్' డబుల్ బ్లాక్‌బస్టర్ అవుతుంది' అని నమ్మకం వ్యక్తం చేసింది కావ్య థాపర్.

'డ్రాగన్'కు ముహూర్తం ఖరారు?

ప్రస్తుతం 'దేవర' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు అగ్ర హీరో ఎన్టీఆర్. కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ పాన్ ఇండియా చిత్రం సెప్టెంబర్ 27న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమా తర్వాత ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో ఇంటెన్స్ యాక్షన్ డ్రామాకు సిద్ధమవుతున్నారు ఎన్టీఆర్. అగ్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మించనుంది. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన మే నెలలో వెలువడింది. ఈ చిత్రానికి 'డ్రాగన్' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారని వార్తలొచ్చాయి. ఆగస్ట్‌లో ఈ చిత్రాన్ని ప్రారంభిస్తామని మేకర్స్ ప్రకటించారు. తాజా సమాచారం ప్రకారం ఈ వారంలోనే ఈ సినిమాను లాంచ్ చేయబోతున్నట్లు తెలిసింది. ఈ విషయంలో త్వరలో ఓ ప్రకటన వస్తుందని చెబుతున్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్ 'దేవర' చిత్రంతో పాటు హిందీలో 'వార్-2'లో నటిస్తున్నారు. ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్‌పై దేశవ్యాప్తంగా ఇప్పటికే భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి.

కమిటీకుర్రోళ్లు కొత్తగా ఉంటారు

'కొత్తదనం ఉన్న మంచి సినిమాలను తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తూనే ఉన్నారు. 'కమిటీ కుర్రోళ్లు' ఆ తరహా సినిమానే. ఇది గోదావరి చుట్టుపక్కల ప్రాంతాల్లో జరిగే కథ. నిహారిక మల్టీ టాలెంటెడ్. మంచి చిత్రాలను నిర్మిస్తూ తన అభిరుచిని చాటుకుంటోంది. ఈ సినిమా నేను చూశాను. చాలా బాగుంది. ఈ నెల 9న రాబోతున్నది. మీకూ నచ్చుతుంది. తప్పకుండా చూడండి' అంటూ చిరంజీవి వీడియో ద్వారా సందేశం ఇచ్చారు. నిహారిక కొణిదెల సమర్పణలో రూపొందిన చిత్రం 'కమిటీ కుర్రోళ్లు'. యదువంశీ దర్శకుడు. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్.ఎల్.పి, శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ బ్యానర్స్‌పై రూపొందిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్ సోమవారం హైదరాబాద్‌లో జరిగింది. నాగబాబు, వరుణ్‌తేజ్, సాయిదుర్గతేజ్, అడివిశేష్, వెంకీ అట్లూరి ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసి చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. 'ఈ సినిమా విడుదలయ్యాక దర్శకుడు యదువంశీ పేరు ఎక్కువగా వినిపిస్తుంది. టెక్నికల్ టీమ్ మొత్తం మనసుపెట్టి పనిచేశారు. కొత్తవాళ్లైనా అందరూ అద్భుతంగా నటించారు. కచ్చితంగా విజయం సాధిస్తుందనే నమ్మకంతో ఉన్నాం' అని నిహారిక కొణిదెల ఆశాభావం వ్యక్తం చేసింది. ఇంకా చిత్ర యూనిట్ సభ్యులందరూ మాట్లాడారు.

చర్యకు ప్రతిచర్య తప్పదు

విశ్వక్‌సేన్ తన 13వ సినిమాను షురూ చేశారు. 'దసరా'తో భారీ విజయాన్ని అందించిన ఎస్ఎల్‌వీ సినిమాస్ అధినేత సుధాకర్ చెరుకూరి చిత్రానికి నిర్మాత. శ్రీధర్ గంటా దర్శకుడు. గ్రాండ్ ప్రొడక్షన్ వాల్యూస్‌తో హైబడ్జెట్‌తో సినిమాను నిర్మించనున్నామని నిర్మాత తెలిపారు. పల్లెటూరి నేపథ్యంలో సాగే పొలిటికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కనున్న ఈ సినిమాలో విశ్వక్‌సేన్ పవర్‌ఫుల్ ఐపీఎస్ అధికారిగా నటించనున్నారు. దానికి సంబంధించిన ప్రీలుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. 'ఎవ్రీ యాక్షన్ ఫైర్స్ ఎ రియాక్షన్' అనే ట్యాగ్‌లైన్ ఈ పోస్టర్‌పై కనిపిస్తున్నది. 'వీఎస్ 13' వర్కింగ్ టైటిల్‌తో రూపొందనున్న ఈ సినిమాకు రచన, దర్శకత్వం శ్రీధర్ గంటా కాగా, కెమెరా: కిశోర్‌కుమార్, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్.

తొలిప్రేమ జ్ఞాపకాల్లో..

దీపుజాను, వైశాలిరాజ్ ప్రధాన పాత్రల్లో నటించిన మ్యూజికల్ ఆల్బమ్ 'ఫస్ట్‌లవ్'. బాలరాజు ఎం దర్శకత్వం వహించారు. వైశాలిరాజ్ నిర్మాత. ఈ ఆల్బమ్‌లోని ఓ గీతాన్ని సంగీత దర్శకుడు తమన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పాటలో అద్భుతమైన కథను చూపించారని, ఓ మంచి లవ్‌మూవీ చూసిన అనుభూతికలిగిందని, విజువల్స్ కూడా బ్యూటీఫుల్‌గా ఉన్నాయని చెప్పారు. సిధ్‌శ్రీరామ్ గాత్రం ఈ పాటను మరో స్థాయికి తీసుకెళ్లిందని, మనసుకు హత్తుకునే గీతమిదని దర్శకుడు బాలరాజు తెలిపారు. టీమ్ అందరం ఎంతో ఇష్టంతో ఈ పాటను తీర్చిదిద్దామని హీరోయిన్, ప్రొడ్యూసర్ వైశాలిరాజ్ పేర్కొంది. ఈ ఆల్బమ్‌కు సంజీవ్ టి సంగీతాన్నందించారు.

తెలుసుకదా.. మొదలైంది

బ్లాక్ బస్టర్ 'టిల్లు స్క్వేర్' తర్వాత సిద్దు జొన్నలగడ్డ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'తెలుసుకదా'. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి కథానాయికలు. ప్రముఖ స్టైలిస్ట్ నీరజ కోన డైరెక్టర్‌గా పరిచయం అవుతున్న ఈ చిత్రానికి టీజీ విశ్వప్రసాద్ నిర్మాత. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మంగళవారం మొదలైంది. 30 రోజుల పాటు జరిగే ఈ భారీ షెడ్యూల్‌లో టాకీ సీన్స్‌తో పాటు రెండు పాటల్ని కూడా తెరకెక్కించనున్నారు. తొలి రోజు సిద్ధూతో పాటు రాశీఖన్నా షూటింగ్‌లో పాల్గొన్నది. వైవా హర్ష ముఖ్య భూమిక పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: జ్ఞానశేఖర్, సంగీతం: తమన్, ఎడిటింగ్: నవీన్ నూలి, నిర్మాణం: పీపుల్‌మీడియా ఫ్యాక్టరీ.

ప్రేమ వర్సెస్ పిచ్చి

విజయ్‌శంకర్, విషిక జంటగా రూపొందిన రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'పాగల్ వర్సెస్ కాదల్'. రాజేశ్ ముదునూరి దర్శకుడు. పడ్డాన మన్మథరావు నిర్మాత. ఈ నెల 9న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ ప్రెస్‌మీట్ జరిగింది. ఇందులో తాను ప్రేయసితో ఇబ్బందులు పడే ఇన్నోసెంట్ అబ్బాయి కార్తీక్‌గా కనిపిస్తానని, ప్రతి ప్రేమికుడుకీ రిలేట్ అయ్యాలా ఈ కథ ఉంటుందని హీరో విజయ్‌శంకర్ తెలిపారు. ఇందులో తన పాత్ర పేరు ప్రియ అని, బాయ్‌ఫ్రెండ్‌ని ఎప్పుడూ అనుమానిస్తూ ఇబ్బందులు పెడుతుంటానని, అందరికీ నచ్చేలా సినిమా ఉంటుందని కథానాయిక విషిక చెప్పారు. బ్రహ్మాజీ, షకలకశంకర్ తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెర